కథ

# లేత మనసులు

కె. నాగేశ్వరరావు

షాపు నుంచి హడావుడిగా ఇంటికి చేరిన సురేష్, ''రమ్యా! సాయిరామ్ ఎక్కడ?'' అన్నాడు వస్తూనే కోపంగా.

''అదేమిటండీ? ఈ టైములో ఇంటికి వచ్చారు? ఏమైందసలు?'' ఆదుర్దాగా అడిగింది రమ్య.


''ముందు వాడెక్కడున్నాడో చెప్పు'' అన్నాడు కోపంగా సురేష్.

సురేష్, రమ్యలకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు సాయిరామ్ పదవ తరగతి చదువుతున్నాడు. చిన్నవాడు రాజు ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు.

సురేష్ కిరాణా షాపు నడుపుతూ ఇద్దరు పిల్లల్ని గారాబంగా చూసుకుంటున్నాడు.

సాధారణంగా సురేష్ కోపంగా ఉండడు. అలాంటిది ఈరోజు ఇంత కోపంగా ఉండటానికి, షాపునుంచి రాత్రి 10 గంటలకు వచ్చే ఈయన ఈరోజు ఆరు గంటలకే రావటానికి ఏదో సంబంధం ఉండే ఉంటుందనిపించింది రమ్యకు.

''నేనూ వాడికోసమే చూస్తున్నానండీ. అలా ట్యూషన్ మాష్టారు ఇంటికి వెళ్ళాడేమో?'' అంది రమ్య.



''ట్యూషన్‌కేంటి నా బొంద? వాడసలు నాలుగు రోజులుగా స్కూలుకే పోవటం లేదట?''

ఈసారి ఆందోళన చెందటం రమ్య వంతయింది.

సాయిరామ్ అలాంటి వాడు కాదు. చాలా బుద్ధిమంతుడు. వాడిని స్కూల్లో చేర్పించిన దగ్గర్నుంచీ స్కూలుకి ఆబ్సెంట్ అయినది లేదు. చదువులో కూడా ఎప్పుడూ ఫస్టు ర్యాంకే తెచ్చుకునేవాడు. అలాంటిది నాలుగు రోజులుగా స్కూలు ఎగ్గొట్టి ఏం చేస్తున్నట్లు? ఎక్కడుంటున్నట్లు? ఫ్రెండ్స్‌తో సినిమాలకి వెళుతున్నాడా? అయినా వీడికి డబ్బులెక్కడివి? అనుకుంది రమ్య.

ఎంత ఆలోచించినా రమ్యకు ఏమీ పాలుపోవటం లేదు.

''ఏమండీ అసలేమయింది? ఇంతకీ వాడు స్కూలుకెళ్ళటం లేదని ఎవరు చెప్పారూ?'' అడిగింది.

''వాడి ఫ్రెండు గోపాల్ మన షాపు దగ్గరకు సరుకులకు వచ్చాడు. మా వాడు బాగా చదువుతున్నాడా అని అడిగితే ఈ విషయం చెప్పాడు'' అన్నాడు సురేష్.

''అయ్యోరామ! ఏమై ఉంటుంది? నాకు చాలా ఆందోళనగా ఉందండీ'' బావురుమంది రమ్య.

సురేష్ పక్కింటి సుబ్బారావుగారి దగ్గర స్కూటర్ తీసుకొని ఊరంతా తిరగడం మొదలుపెట్టాడు.

రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, సినిమా థియేటర్లు, పార్కులు అన్నీతిరిగినా సాయిరామ్ కనబడలేదు.

చివరగా ట్యూషన్ మాష్టారి దగ్గరకెళ్ళాడు.

''రండి సురేష్‌గారూ! మీకోసమే కబురు చేయాలనుకుంటున్నాను'' అన్నారు ట్యూషన్ మాష్టారు రామనాధంగారు.

కుర్చీలో కూర్చున్నా గుండె వేగంగా కొట్టుకుంటోంది సురేష్‌కు. ''కొంచెం మంచినీళ్ళు కావాలి మాష్టారూ'' అన్నాడు సురేష్. రామనాధం మాష్టారు మంచి నీళ్ళు తెప్పించి సురేష్‌కిచ్చాడు. సురేష్ మంచి నీళ్ళు గటగటా తాగి కొంచెం సేదతీరాడు.

''అవునూ సురేష్‌గారూ! మీ సాయిరామ్ స్కూలుకి రావటం లేదు, ట్యూషన్‌కు రావటం లేదు. ఆరోగ్యం బాగా లేదా ఏమిటి?'' అన్నారు రామనాథం మాష్టారు.

''అబ్బే..లేదు మాష్టారు, రోజూ బయల్దేరి స్కూలుకి వచ్చేస్తున్నాడు. ఇందాక వాడి ఫ్రెండు గోపాల్ చెప్పేంత వరకూ, వాడు స్కూలుకి రావడం లేదనే విషయం తెలీదు. వాడీరోజు ఇంతవరకు ఇంటికి చేరలేదు మాష్టారూ, ఎక్కడున్నాడో, ఏమయ్యాడో అర్థం కావడం లేదండీ?'' కంగారుగా అన్నాడు సురేష్.

''ఐదు రోజుల క్రితం వాడి మీద గట్టిగా కేకలేశాను. మొన్నటితో పరీక్ష ఫీజు కట్టాల్సిన టైము కూడా అయిపోయింది. ఈ నెల ట్యూషన్ ఫీజు తేలేదు. మీరు ఎప్పుడూ ఫస్టు తారీఖునే ఫీజు పంపేస్తుంటారు కదా! ఫీజు కట్టలేదు. టైమయిపోయింది. మీ నాన్నగారిని తీసుకొస్తే కానీ రావద్దన్నాను. అప్పటి నుండి రావట్లేదు'' చెప్పాడు రామనాథం మాష్టారు.

''అదేమిటి? ఫస్టునే పరీక్ష ఫీజూ, మీ ట్యూషన్ ఫీజూ ఇచ్చి పంపించానే. మీకిచ్చాశాడనే అనుకున్నాను'' అన్నాడు సురేష్.

''అక్కడికీ అడిగాను, మీ నాన్నగార్కి చెప్పావా? అంటే ఉలుకూ లేదు, పలుకూ లేదు. అందుకే కోప్పడ్డాను. ఫైన్‌తో కూడా టైము అయిపోతోందని. ఫీజు నేనే కట్టేశాను లెండి. మరా డబ్బులు ఏం చేసినట్లు?'' అన్నారు రామనాధంమాష్టారు.

మాష్టారు పరీక్ష ఫీజు కట్టేసినందుకు థాంక్స్ చెప్పి, డబ్బులు వెంటనే జేబులోంచి తీసి ఇచ్చేశాడు సురేష్.

''వెళ్ళొస్తాను మాష్టారూ! వాడి ఫ్రెండ్సు ఇళ్ళకు వెళ్ళి కనుక్కుంటాను'' అని లేచాడు సురేష్.

''వీడు ఎందుకిలా తయారయ్యాడు? డబ్బులేం చేశాడు? ఇప్పుడు ఎక్కడున్నాడు?'' ఒకదాని వెంట మరొక సందేహం. భయం. ఆందోళనతో ఇల్లు చేరుకున్నాడు.

''సాయిరామ్ కన్పించాడా?'' ఎదురుగా వచ్చి

రమ్య అడిగేసరికి గుమ్మంలో అడుగుపెట్టకుండా ఆగి పోయాడు సురేష్.

''ఇంటికింకా రాలేదా? బజారులో అన్ని చోట్ల వెతి కాను ఎక్కడా కన్పించలేదు'' గొంతులో కన్నీని ఒణుకు.

''ఏమండీ! నాకేదో భయంగా ఉందండీ?''

''రమ్యా! వీడు పరీక్ష ఫీజు, ట్యూషన్ ఫీజూ కూడా కట్టలేదుట'' అని మాష్టారు చెప్పిన విషయం అంతా వివరించాడు.

రాత్రి పది దాటింది.

సాయిరామ్ ఎక్కడికి వెళ్ళాడో అర్థంగాక సురేష్, రమ్యలు నీరసపడిపోయారు. ఇరుగుపొరుగు వారు వారిని ఓదారుస్తున్నారు. ఇక ఏదో దుర్వార్త వినాల్సి వస్తుంది. తప్పదు అనుకుంటున్నారు.

అంతలో..''అమ్మా..నాన్నా! అన్నయ్య ఇంట్లో దగ్గర బీరువా వెనుక ఉన్నాడు. మూలుగుతున్నాడు. పిలిస్తే పలకటం లేదు.'' అన్నాడు చిన్న కొడుకు రాజు.

సురేష్, రమ్యలు పరుగెత్తుకుని వెళ్లి బీరువా వెనక ఉన్న సాయిరామ్‌ని గట్టిగా కౌగలించుకున్నారు. ఒళ్లంతా భగభగమండిపోతున్నది.

''రమ్యా! సాయిరామ్‌కి జ్వరం వచ్చినట్టుంది. త్వరగా హాస్పిటల్‌కి తీసుకెళదాం'' అని ఆటో పిలుచు కుని వచ్చి ఆటోలో తీసుకెళ్లారు.

డాక్టరుగారు సాయిరామ్‌ని పరీక్షించి దడుసుకుని జ్వరం వచ్చింది మరేం ఫర్వాలేదు అని నీరసం తగ్గడా నికి సెలైన్ బాటిల్ ఎక్కించి, ఇంజక్షన్లు, టాబ్లెట్లు యిచ్చారు. ఈరోజుకి ఇక్కడే ఉంచండి. రేపు ఇంటికి తీసుకెళుదురుగానీ అన్నారు డాక్టరుగారు.

సాయిరామ్ ప్రొద్దుటికి పూర్తిగా కోలుకున్నాడు. బంధువులు, సాయిరామ్ ఫ్రెండ్సు అందరూ వచ్చి పలు కరించి వెళ్లారు.

సాయిరాం తండ్రితో ''నాన్నా! నేనీ సంవత్సరం పద తరగతి పరీక్షలు వ్రాయడం కుదరదుగదా?'' అన్నాడు.

''లేదు...నాన్నా మాష్టారుగారు నీ పరీక్ష ఫీజు కట్టారు. నీవు దర్జాగా పరీక్షలు వ్రాయొచ్చు'' అన్నాడు సురేష్.

సాయిరామ్ తండ్రి ఒళ్లో తలపెట్టుకుని ఏడుస్తున్నాడు. కాసేపు వాడిని ఓదార్చిన తర్వాత ''సాయి! నీకు పరీక్ష ఫీజుకని, ట్యూషన్ ఫీజుకని మూడొం దలు యిచ్చాను కదరా! ఏం చేశావు నాన్నా!'' అనడిగాడు నెమ్మదిగా సురేష్.

సాయిరామ్ కళ్లలో నీళ్లు టప టప రాలుతున్నాయి.

ఆ రోజు టెలిగ్రామ్ వచ్చిందని షాపు నుంచి కంగారుగా వచ్చిన సురేష్. ''రమ్యా! మా అమ్మకు చాలా సీరియస్‌గా ఉందంట. మనం అర్జం టుగా హైద్రాబాద్ వెళ్లాలి'' అన్నాడు కలవరపడుతూ.

''అయ్యో! అంటూ బోరుమంది రమ్య.

''ఇప్పుడెలా అండీ! పోయిన నెలేకదా! మీ చెల్లెలు పెళ్లి చేశారు. మంచి సంబంధం అని రెండులక్షలు కట్నం అంటే మీ అమ్మవాళ్ళు లక్ష, మనము లక్ష యిచ్చి ఘనంగా పెళ్లి చేశాము. ఇంకా మనము ఆ ఖర్చుల నుంచి కోలుకోలేదు. మళ్లీ ఈ దెబ్బా మనకు? మన దగ్గర ఇప్పుడు ఒక్క రూపాయి కూడా లేదు. ఇంకా బట్టలషాపులో అప్పుకూడా తీర్చలేదు'' అంది రమ్య.

నువ్వు చెప్పింది కరెక్టే. నా దగ్గర రెండు వేలు న్నాయి. నిజానికి ఈ డబ్బులు ఎటూ చాలవు. హైద్రాబా ద్‌లో ట్రీట్‌మెంట్ అంటే కనీసం పదివేలు దాటుతుంది. నాన్న పెన్షన్ డబ్బు వారి ఖర్చులకే సరిపోవటం లేదు. ఇప్పుడు ఏం చేయాలి? ఛీ..ఛీ ఈ వెదవ బ్రతుక్కి సుఖం, సంతోషం లేవు. ఆ వడ్డీ వ్యాపారి కిషన్‌లాల్ దగ్గ రకెళ్ళి ఓ పదివేలు అప్పు అడుగుతాను అన్నాడు సురేష్ బాధగా.

''ఏమండీ! అప్పు వద్దండీ. ఈనల్లపూసల తాడు అమ్మేయండీ. ఉన్నప్పుడు మళ్లీ చేయించుకో వచ్చు'' అంది రమ్య.

ఇన్నేళ్ల కాపురంలో అప్పులు, నానుతాడు మాత్రం మిగిలాయి. కిరాణా వ్యాపారం అంతగా కలిసిరావడం లేదు. ఇప్పుడు ఉన్న కాస్త బంగారం కరిగిపోతుంది. మనసులో అనుకున్న మాటలు భార్యతో అన్నాడు.

సాయిరామ్‌కి ఇంటి పరిస్థితి పూర్తిగా అర్థమైంది. బాధగా తండ్రిని, తల్లిని చూస్తుండిపోయాడు.

''నాన్న గారు! పరీక్షఫీజు కట్టాలి?'' అన్నాడు సాయిరామ్.

ఇదిగో అంటూ మూడొందలు సాయిరామ్ చేతిలో పెట్టాడు సురేష్.

ఈ డబ్బుకోసమే కదా నాన్న గారు ఇంత బాధపడు తున్నారు. ఈ డబ్బును ఎలాగైనా సంపాదించి అమ్మకు ఒంటినిండా నగలు, నాన్నకు డబ్బులు ఇవ్వాలి అనుకు న్నాడు సాయిరామ్ మనసులో.

రోడ్డుమీద వచ్చి ఆలోచిస్తూ వెళ్తున్నాడు. అక్కడ పదికి పది, వందకు వంద అంటూ ఓ వ్యక్తి అరుస్తుంటే గుంపులుగుంపులుగా జనం మూగేనారు. సాయిరామ్ అక్కడికి వెళ్లి ఆసక్తిగా ఆ ఆటను గమనించసాగాడు.

చూడండి బాబులూ! ఈ నెంబరు మీద వేస్తే వందకు వంద, వెయ్యికి వెయ్యి అంటూ ఉత్సాహపరు స్తున్నాడా వ్యక్తి.

సాయిరామ్ ఒక వందతీసి ఒక నెంబరు మీద పెట్టాడు. ఆ నెంబరుకే వందకువంద వచ్చింది. ఆనం దంతో ఉక్కిరిబిక్కిరి అవుతూ వచ్చిన వందతో కలిపి మొత్తం నాలుగువందలు ఇంకో నెంబరుమీద కాశాడు. ఈ సారి ఆ నెంబరుకు తగలలేదు.

సాయిరామ్ ఏం చేయాలో తెలియక ఏడుస్తుంటే ప్రక్కనున్న వ్యక్తి జాలిపడి పదిరూపాయలిచ్చి ఇంటికి వెళ్ళమన్నాడు.

ఆ పదిరూపాయలు తీసుకుని దారిలో వస్తుంటే, భాగ్యలక్ష్మి లాటరీ సార్! పదిరూపాయలు పెట్టి కొన్నా రంటే రేపు ఈ పాటికి కోటీశ్వరులు అవుతారు. రండిసార్ రండి త్వరపడండి అంటూ ఓ వ్యక్తి లాటరీ టిక్కెట్టు సాయిరామ్‌కిచ్చాడు.

చివరిసారి తన అదృష్టం పరీక్షించుకుందామని ఆ పది రూపాయలు పెట్టి లాటరీ టిక్కెట్టు కొన్నాడు. మరు సటిరోజు పేపరులో తన నెంబరు లేకపోయేసరికి సాయి రామ్ నీరసపడిపోయాడు.

సాయిరామ్‌కు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

ఇంట్లోనుంచి వెళ్లిపోయి ఏదో విధంగా డబ్బు సంపాదిద్దామంటే ధైర్యం చాలటం లేదు. ఇంటికి వచ్చి అమ్మ నిద్రపోతుంటే బీరువా వెనక్కి వెళ్లి దాక్కున్నాడు.

సాయిరామ్ చెప్పిన విషయాలన్నీ విని రమ్య, సురే ష్‌లు బావురుమన్నారు.

సాయిరామ్ చెప్పిన విషయాలన్నీ డాక్టరుగారు కూడా విన్నారు.

''చూడండి సురేష్ గారూ! మనము ఇంట్లో ఎన్నో విషయాలు మాట్లాడుకుంటూ ఉంటాం. అందులో పిల్లలు వినకూడనవి ఎన్నో వుంటాయి. మనము మన సమస్యల గురించి ఇంట్లో చెప్పుకుంటుంటే ఆ మాటలు విన్న పిల్లలపై ఆ ప్రభావం తప్పకుండా వుంటుంది. ప్రపంచంలో అడుగడుగునా మోసమే.

పెద్దవాళ్లం మనకు అన్నీ తెలిసి అనేక సార్లు మోస పోతున్నాం. చిట్‌ఫండ్ కంపెనీలనీ, షేర్లనీ, ఫ్లాట్లనీ ఇలా రకరకాలుగా మోసపోతున్నాం. ఇక పిల్లలకేం తెలుస్తుంది చెప్పండి. వీటిలో ఎంత మోసం ఉందో.

''పెద్దల ప్రభావం సున్నిత మనస్కులైన పిల్లల మీద తప్పకుండా ఉంటుంది. ఇంటి సమస్యలు మరెప్పుడూ పిల్లల దగ్గర ప్రస్తా వించకండి. ఒక డాక్టరుగా గాక మీ శ్రేయోభి లాషిలాగా చెబుతున్నాను'' అన్నారు డాక్టరు గారు.

''మంచి విషయం చెప్పారు డాక్టరు గారు'' అంటూ సురేష్, రమ్యలు సాయిరా మ్‌ని తీసుకుని ఇంటికి బయల్దేరారు. ★

